# మాబడి

OUR SCHOOL

SCHOOL MAGAZINE

MONTHLY

AUGUST'19














జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం -ప్రచురణలు

# మా బడి

OUR SCHOOL

SCHOOL MAGAZINE

సంపుటి : 1 మాసపత్రిక సంచిక : 1

పేజీలు : వెల : ఉచితం

## సంపాదకులు







ఆకు (ఆదిత్య కుమారి), స్కూల్ అసిస్టెంట్

జి.ప.ఉ.పా. రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా.

## గౌరవ సంపాదకులు





సి. హెచ్.లత,ప్రధానోపాధ్యాయురాలు,

జి.ప.ఉ.పా. రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా

వి.వేణుగోపాల్ రాజు,స్కూల్ అసిస్టెంట్,

జి.ప.ఉ.పా. రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా

*Best compliments from*

సర్పంచ్.శ్రీ.దండా పుల్లయ్య గారు మరియు SMC చైర్మన్ వై.నాగేశ్వర రావు గారు

జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం -ప్రచురణలు

# లోపలి పేజీల్లో

ఈ పుస్తకంలో ఏముంటాయో ముందుగానే చెబితే, మీరు అన్నీ చదవరు కదా !

పేరు చూడగానే నచ్చినవి మాత్రమే చదువుతారు. మిగిలినవి చదవరు.

ఏమున్నాయో తెలుసుకోవడం కోసమైనా పుస్తకాన్ని మొత్తం ఒక్కసారైనా తిరగేస్తారనే విశ్వాసంతో ఇక్కడ ఏమీ తెలియజేయడం లేదు.

అయినా దీనిలో మీకు ఆసక్తిని కల్గించే అంశాలు, మీకు తెలియని అంశాలు, మీకు ప్రేరణ నిచ్చే అంశాలు ఎన్నో ఉంటాయి.

అంతేకాదు రాబోయే పత్రికలకు మీరూ రచనలు పంపవచ్చు.

ఇది మీ పత్రిక. మీకోసమే రాయబడుతున్న పత్రిక.

నెల నెలా పత్రిక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తారని ఆశిస్తూ.............

ఇక చదవండి.



తలదించి నన్ను చూడు

తల ఎత్తుకునేలా నేను చేస్తా

# సంపాదకీయం

## హాయ్ ఫ్రెండ్స్!

బావున్నరా! జూలై నెలంతా ప్రాజెక్టులని, పరీక్షలనీ టీచర్లందరూ హడావుడి చేసారు కదూ! అయితే మీరు కొంచెం రిలాక్స్ అవ్వాలంటే ఈ చిన్ని పుస్తకం తప్పకచదవాలి.

అంత గొప్పగా వుంటుందా? అని అనుకోకండి. చదివితే కదా తెలిసేది? మీకు తెలియని ఎన్నో విషయాలను ఈ పుస్తకం ద్వారా మీకు తెలియజేయడానికి ప్రయత్నించాను. చదవండి. చదివి నచ్చిన వాటి గురించి, నచ్చని వాటి గురించి అందరికీ చెప్పండి. తద్వారా మీకు ఎంతో మంది ఫ్రెండ్స్ అవుతారు కదా!

అన్నట్టూ, మరిచిపోయాను. ఈ నెలలోనే రాఖీ పండుగ ఉంది కదూ! అబ్బ ఈ పండుగ అంటే ఎంత సరదానో కదా!అక్కా తమ్ముళ్ళు, అన్న చెల్లెండ్ల ఆప్యాయతలను చూస్తే కలిగే సంతోషం,ఈ పుస్తకం చదవడం ద్వారా కల్గుతుందని నమ్ముతున్నాను. చదువుతారు కదూ!

ఇకపోతే చరిత్రలో ఈ నెల ప్రత్యేకత ఏంటో తెలుసా? అదేనండీ మన జాతిపిత మహాత్మాగాంధీగారి వలన 1947వ సం॥లో ఆగష్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రతి సంవత్సరం ఆగష్టు 15న మనం జాతీయ పతాకాన్ని ఎగురవేసుకొని, దానికి వందనం చేసి, ఎంతో ఎంజాయ్ చేస్తాం కదూ!

అంతే కాదండోయ్! మనం పీల్చే గాలిలో అధికంగా ఉండే ఆక్సిజన్‌ని జోసెఫ్ ప్రీస్ట్లీ, షీలే అనే శాస్త్రవేత్తలు కనుగొన్నది కూడా ఆగష్టునెల లోనే(1774 సం.లో)

అంతే కాదండోయ్! విషాదఛాయలూ ఉన్నాయి. మన జాతీయోధ్యమ నాయకుడు బాలగంగాధర తిలక్ మరణించిందీ ఈ నెలలోనే.(1920 సం.లో)

ఇలా చెప్పుకుంటూ పోతే ఆగష్టు నెలలో ఎన్నో అద్భుతాలూ, విషాదఛాయలూ ఉన్నాయి.

ఫ్రెండ్స్ మీకు ఇవన్నీ చెప్పి మీకు బోరుకొట్టించినట్టున్నాను. ఇక చదవండి.

ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకు రావడంలో సహాయ పడిన శ్రేయోభిలాషులకు, రచయితలకు జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం ఉపాధ్యాయుల తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.మీకు ఎంతో కొంత ఉపయోగపడుతుందనే నమ్మకంతో.............



మీ



# మా కోవెల గురించి ...........







హాయ్ ఫ్రెండ్స్,

ముందుగా మీ అందరికీ నమస్కారములు. మా బడి నుండి మా స్టాఫ్ మరియు పిల్లల భాగస్వామ్యం తో మీ అందరి కోసం ఒక మ్యాగజైన్ ని ప్రారంభించాలని అనుకున్నాం. అందులో భాగంగా మొదటి సంచికను ఈ నెల నుండి ప్రారంభిస్తున్నాం. మొదటి సంచిక కాబట్టి మీరు దానిని ఆదరిస్తారని, ఏవైనా సలహాలు సూచనలు అందించాలని కోరుకుంటున్నాను. మీ అభిరుచులకు అనుగుణంగా మా పత్రికను తీర్చిదిద్దుతామని హామీ ఇస్తున్నాను.

ఇక పొతే మా బడి గురించి...

మాది ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మా బడి 1959 సం.లో ప్రారంభించడం జరిగింది. మండల కేంద్రానికి 8.5 కి.మీ.ల దూరంలో కలదు. పక్కా భవనాలు, విశాలమైన ఆటస్థలం వున్నాయి. అంకిత భావంతో పనిచేసే సిబ్బంది వున్నారు.

మా బడిలో 6 నుండి 10 తరగతుల వరకు తెలుగు మీడియం కలదు. ప్రతి సంవత్సరం 10వ తరగతి లో 95% పైగా ఉత్తీర్ణత సాధిస్తున్నాం. ఈ సంవత్సరం నుండి 6వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రారంభించాము.

పిల్లలలో పఠనాశక్తి పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ సంచికను ప్రారంభించాము. మీ అందరి సహకారంతో ఈ మాస పత్రికను ఇంకా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నాను.

మీ ఆదరణ కోసం ఎదురుచూస్తూ........ మీ **లత**

ప్రధానోపాధ్యాయురాలు



The best brains of the nation may be found on the last benches of the Classroom

\- APJ ABDUL KALAM

# వింత ప్రపంచం



సేకరణ:
జే.పూజిత, 10వ తరగతి,
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం.ఖమ్మం జిల్లా.

## అమ్మా నీవు ఎంత మంచి దానివో కదా.............

సృష్టిలో అమ్మ ప్రేమను మించింది మరోటి లేదు. ఈ విషయంలో జంతువులకూ ఏ మినహాయింపు లేదు. అవి వాటి పిల్లల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతాయి. వాటి ప్రేమ విషయంలో మనం వాటికి చేతులెత్తి మొక్కాలి.

ప్రక్కనున్నది ఏమిటో తెలుసా! జెయింట్ పసిఫిక్ ఆక్టోపస్. ఇది తన కన్న పిల్లల కోసం తుది శ్వాస వరకూ పాటు పడుతుంది. ఇది ఒకేసారి లక్ష గుడ్లను పెడుతుంది తెలుసా! వాటిని పొదగడానికి 40 రోజులు పడుతుందట. పొదిగే వరకు వాటిని శత్రువుల బారిన పడకుండా జాగ్రత్త తీసుకుంటుంది. గుడ్ల నుండి పిల్లలు బయటకు రావడానికి సాయం చేసి చివరకు తుది శ్వాస విడుస్తుంది.







ఇది మరో మాతృమూర్తి కథ. ఒరంగుటాన్ లు కన్నపిల్లలను చాలా జాగ్రత్తగా పెంచుతాయి. పుట్టిన దగ్గర్నుండి ఏడేళ్ళు నిండేతవరకు వాటిని కిందకు దింప కుండా పెంచుతాయి. సొంతంగా ఆహారాన్ని సంపాదించుకోవడం దగ్గర్నుండి గూడు కట్టుకోవడం వరకు అన్ని విషయాలను ఇవి దగ్గరుండి మరీ నేర్పిస్తాయి. జీవులన్నిటిలో పిల్లల్ని ఎక్కువకాలం సాకేది ఇదేనంటే నమ్మగలరా.రోజుకో కొత్త గూడు కట్టుకుంటాయి. జీవితం మొత్తంలో ఇవి 30000 గూళ్ళు కటుకుంటాయి.

ఇక్కడ కనపడేది రెడ్ నాబ్డ్ హార్న్ బిల్స్.దీనికి పిల్లలంటే ప్రాణం. తిండి తిప్పలు మాని మరీ గుడ్లను పొదుగుతుంది. ఇవి ముఖ్యంగా ఇండోనేషియా లోని సులవేసి అనే ద్వీపంలో ఉంటాయి. వీటి గూళ్ళు ఏమిటో తెలుసా? చెట్ల తొర్రలు. వీటి గూళ్ళలో ఉండే గుడ్లను తినడానికి మానిటర్ అని పిలవబడే బల్లులు దాడి చేస్తాయి. వాటి నుండి కాపాడుకోవడానికి తల్లి నానా తంటాలు పడుతుంది. ఇవి తమ శరీరం నుండి వచ్చే ప్రత్యేకమైన లేపనాన్ని ముక్కుతో గూడు ద్వారానికి పూసి శత్రువు రాకుండా ద్వారాన్ని ఇరుకుగా చేస్తాయి.ఇవి గుడ్లను పొదిగినంత కాలం అంతే రెండు నెలలు తిండి తినకుండా అక్కడే కదలకుండా ఉండిపోతాయి.






**వీటిని చదవండి........**

1. ¼ రము π ½ లో వున్నది.
2. .,→, మంచి స్నేహితులు.

సేకరించినవారు : సమీరా,పదవ తరగతి.





# నేనెవరో తెలుసా?



- ఆదిత్య కుమార్, స్కూల్ అసిస్టెంట్,
రాజేశ్వరపురం, ఖమ్మం.


**డియర్ ఫ్రెండ్స్!**

**ఈ శీర్షికలో ప్రతి నెల ఒక మూలకం తన గురించిన ఆసక్తి కర విషయాలను మనతో పంచుకుంటుంది. వాటిలో కొన్ని మనకు తెలిసినవి ఉండవచ్చేమో! కానీ తెలియనివి ఇంకొన్ని ఉండవచ్చుగా! చదివితేనే కదా తెలిసేది. కాబట్టి మీరు చదివి మీ అభిప్రాయాలు చెప్పండి.**

హాయ్ ఫ్రెండ్స్! నేను మీకు ఉపయోగ పడే నెంబర్ 1 మూలకాన్ని. అదేనండీ! హైడ్రోజన్‌ను.నా పరమాణు సంఖ్య 1. మూలకాల పట్టికలో ఒకటవ పీరియడ్ మరియూ ఒకటవ గ్రూపూకూ చెందినదాన్ని. నన్ను తెలుగులో 'ఉదజని' అని పిలుస్తారు. నన్ను ఆంగ్ల అక్షరం 'H ' తో సూచిస్తారు. నేను మీ నిత్యజీవితంలో ఒక భాగమై పోయానంటే నమ్మరేమో! ఎందుకంటే నేను మీరు త్రాగే నీటిలోనూ, తినే ఆహారంలోనూ ఉంటాను. అదెలా అంటారా? మీరు అంతా చదవండి మీకే తెలుస్తుంది.

సాధారణంగా నేను వాయు రూపంలో ఉంటాను. నాకు రంగు, రుచి, వాసన లేవు. నేను అత్యంత తేలికైన వాయువును. ఒక లీటరు గాలి బరువు 1.29 గ్రాములైతే, అదే ఒక లీటరు నా బరువు 0.09 గ్రాములు మాత్రమే. నన్ను మొదటి సారిగా ఎవరు కనుగొన్నారో తెలుసా? మొట్టమొదటిసారి నన్ను హెన్రీ కేవెండిష్ అనే శాస్త్రవేత్త 1766 సం॥లో లోహాలను ఆమ్లంతో చర్య జరిపించి తయారుచేసాడు. నేను గాలిలో మండి ఉదకము(నీరు)ను ఇస్తాను కాబట్టి నన్ను 'ఉదజని' అని పిలుస్తారు. నీటి యొక్క రసాయన సాంకేతికం '$H_2O$'. అంటే నీటిలో నేను(హైడ్రోజన్) రెండు ప్రమాణాలుంటే, ఆక్సిజన్ ఒక ప్రమాణమే ఉంటుంది

హెన్రీ కేవెండిష్



1731 – 1810


అన్నట్టూ మరిచిపోయాను, మీ శరీర భాగాలను ఎక్స్‌రే, స్కానింగ్‌ల ద్వారా ఎలా చూస్తారో మమ్మల్ని వర్ణపటాల ద్వారా చూస్తారు. నా ఫోటోలను చూడండి.



Purple glow in its plasma state




హైడ్రోజన్లోవర్ణపటరేఖలు




అత్తరు దుకాణానికి వెళితే – మనమేమీ కొనక పోయినా కొంత పరిమళాన్ని వాసన చూస్తాం.
మంచి వారి సాహచర్యమూ అంతే.

## ఆవర్తన పట్టికలో నా స్థానం :




## మీ నిత్యజీవితంలో నేను :

**నన్ను నిత్యజీవితంలో ఎక్కడెక్కడ ఎలా వాడుతారో చూడండి.**

*1. పంట పొలాల్లో పక్షులను తరిమికొట్టే ఎయిరోస్టాట్ బెలూన్!*

చేతికి వచ్చిన పంటలను, చేపల చెరువులను నాశనం చేసే పక్షులు, జంతువులు, క్రిమి కీటకాలను తరిమి కొట్టడానికి ఎయిరోస్టాట్ అనే బెలూన్‌ను బెంగళూరుకు చెందిన నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఫోరం (ఎన్‌డీఆర్‌ఎఫ్) తయారు చేస్తున్నారు. వేడి గాలితో నిండిన ఈ బెలూన్ పొడవు సుమారు నాలుగు మీటర్లు ఉంటుంది. వ్యవసాయ క్షేత్రాల పైభాగంలో ప్రయాణించే ఈ బెలూన్ నౌకనాద్వారా(హైడ్రోజన్ )లేదా హీలియం ద్వారా పనిచేస్తుంది. ఈ




బెలూన్‌లో ఏర్పాటు చేసిన శబ్ద పరికరాలు, లేజర్ కిరణాలు పక్షులు, జంతువులను ఆ ప్రాంతం నుంచి పారిపోయేలా చేస్తాయి.




*2. గాయాలను వైద్యులు హైడ్రోజన్ పెరాక్సైడు($H_2O_2$)తో లేదా స్పిరిట్‌తో శుభ్రపరుస్తారు.*

హైడ్రోజన్ పెరాక్సైడుతో గాయాలను కడిగినప్పుడు అది విచ్ఛిత్తి చెందడం ద్వారా వెలువడే ఆక్సిజన్, సూక్ష్మజీవుల జీవరసాయనాలతో చర్య జరిపి, వాటిని పనిచేయకుండా చేస్తుంది.


చూసారుగా!$H_2O_2$అంటే ఇందులోనూ నేను ఉన్నాను





*3. భారజలం (డ్యుటీరియం) $D_2O$:*

న్యూక్లియర్ రియాక్టర్లలో భారజలాన్ని సాధారణంగా న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారి (moderator) గా వాడతారు.యురేనియంపరమాణువుల విచ్ఛిత్తికి తక్కువ వేగంగల న్యూట్రాన్లు అవసరం. న్యూట్రాన్ లను భారజలం ద్వారా పంపి వాటి వేగాన్ని తగ్గిస్తారు

మణుగూరు లోని భారజల కర్మాగారం



భారజలం



*4. డాల్డా, వనస్పతి మొదలైనవి తయారీ కి :*




అసంతృప్త నూనెలను సంతృప్త కొవ్వులు గా మార్చే ప్రక్రియలో నన్ను(హైడ్రోజన్ వాయువును) వాడుతారు. అసంతృప్త నూనెల లోనికి నన్ను (హైడ్రోజన్ వాయువును) పంపిస్తూ. నికెల్, ఉత్ప్రేరకం సమక్షంలో, 241 మెగా పాస్కల్ పీడనం వద్ద, సుమారు 300 డిగ్రీల సెల్సియస్ వరకు వేడిచేసి సంతృప్త కొవ్వులుగా (డాల్డా, వనస్పతి మొదలైనవి) తయారు చేస్తారు.

5. సూర్యుడిలోని అగ్నికి కారణం నేనే (హైడ్రోజనే) :



నేను త్వరగా మండుతాను. మీకు తెలుసు సూర్యుడు ఒక పెద్ద అగ్ని గోళమని. సూర్యుడిలోని మంటలకు కారణమైన ముఖ్య మూలకాన్ని నేనే.

6. వెల్డింగ్ లకు ఉపయోగించే ఆక్సీహైడ్రోజన్ మంటలలో నేనున్నాను.



7. మొక్కలు, చెట్లలో నేను:



అన్ని మొక్కలలోనూ, చెట్లలోనూ నేను(హైడ్రోజెన్) ఉన్నాను. వాటినిండా చక్కెరలు ఉంటాయి. చక్కెరలో నేనుంటాను. కాబట్టి జంతువులు వాటిని తింటాయి. చక్కెరలు శరీరమునకు శక్తినిస్తాయి.

**8. పారిశ్రామిక ఇంధనంగా నేను:**

**నన్ను (ఉదజని) పారిశ్రామికఇంధనంగావిస్తారంగా ఉపయోగించడానికి కారణం నేను అధిక దహనోష్ణం (242 కి.జౌ./మోల్) కలిగి ఉండటమే.**



**ఉదజని,** కార్బన్ మోనాక్సైడ్లేదామీథేన్**వంటి ఇంధనాలను దహనం చేయడాం ద్వారా వచ్చే శక్తిని సరళరీతిలోవిద్యుచ్ఛక్తిగా మార్చే విధుత్ ఘటాలను "ఇందన ఘటాలు" అంటారు. ఈ ఘటాన్ని అపోలో అంతరిక్ష కార్యక్రమంలో విద్యుత్ సరఫరాకు ఉపయోగించారు.**

**పెట్రోల్కు ప్రత్యామ్నాయ ఇంధనంగా నన్ను(హైడ్రోజన్)వాడబోతున్నారు.**

**9. నాతో తయారుచేసిన బాంబు** (హైడ్రోజన్ బాంబు) :



**ఆపరేషన్ గ్రాప్లీ, క్రిస్మస్ ద్వీపంపై బ్రిటిష్ జరిపిన మొదటి హైడ్రోజన్ బాంబు పరీక్ష**

నాతో చేసిన బాంబు (హైడ్రోజన్ బాంబు)అత్యంత శక్తివంతమైనది,అణుబాంబు కన్నా వెయ్యిరెట్లు ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాను.అణుబాంబుకేంద్రక విచ్ఛిత్తి సూత్రం ద్వారా పనిచేయగా, నా బాంబు కేంద్రకసంలీనం ద్వారా పనిచేస్తుంది.హైడ్రోజన్ బాంబు చర్యలో హైడ్రోజన్ అణువులువేగంగా ఒకదానితో మరొకటి ఢీకొనటం ద్వారా పెద్దమొత్తంలో శక్తిఉత్పన్నమవుతుంది.

ఇలా చెబుతూ పోతే చాలా ఉన్నాయి. మిగిలినవి మీరే వెతకండి. ___ మీ హైడ్రోజన్

# నింపండి - గెలవండి 1

ఈ శీర్షిక కేవలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే. 6 నుండి 10వ తరగతి చదివే వారు మాత్రమే అర్హులు. మీరు చేయవలసిందల్లా క్రింది పజిల్ ను మీ స్వదస్తూరితో నింపి, మీ పేరు, తరగతి, స్కూల్ పేరు, ఊరు రాసి మీ పాఠశాల ఉపాధ్యాయుని ద్వారా మాకు ప్రతి నెలా 27 వ తేదీవరకు అందేలా పంపాలి. సరైన జవాబు రాసిన వారికి 100 రూపాయల బహుమతి ఇవ్వబడును. ఒక్కరి కంటే ఎక్కువ మంది సరైన జవాబు రాస్తే లాటరీ ద్వారా విజేతను ఎంపిక చేయబడును. మరెందుకు ఆలస్యం. పుస్తకం, పెన్ను తీసుకొని నింపండి. గెలవండి..........................

నింపండి

గెలవండి


మాణిక్య రావు

బహుమతి

100 రూపాయలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | ■ | 3 | ■ | 4 | | 5 | | ■ |
| | ■ | ■ | 6 | 7 | | | | ■ | | ■ | 8 |
| | ■ | 9 | ■ | | ■ | ■ | 10 | | ■ | ■ | |
| 11 | | | | | | 12 | ■ | ■ | 13 | | |
| | ■ | ■ | ■ | ■ | 14 | | | ■ | | ■ | ■ |
| 15 | | 16 | ■ | 17 | ■ | | ■ | ■ | 18 | 19 | |
| | ■ | | ■ | ■ | 20 | ■ | 21 | | ■ | | ■ |
| ■ | 22 | | | ■ | | ■ | | ■ | 23 | | |
| 24 | ■ | ■ | ■ | 25 | | | | 26 | ■ | | ■ |
| 27 | | 28 | | ■ | | ■ | ■ | | ■ | | ■ |
| | ■ | | ■ | 29 | | ■ | 30 | ■ | 31 | ■ | 32 |
| | ■ | | ■ | | ■ | 33 | | | | | |

**నిలువు**

1. రామ + ఆలయం ఏ సంధి? (7)
2. అడవి క్రింది నుండి పైకి (2)
3. వెలుగు (2 )
4. సంతోషం (3)
5. 4ని, 2 యొక్క ____ అంటారు.( 2)
7. ఆట (2)
8. కోడిపెట్ట ఆంగ్లంలో (3)
9. దారి పర్యాయ పదం(2)
12. सीता के पति का नाम (3)
13. ఉదయాన్నే తాగేది ఆంగ్లంలో (3)
16. కన్నుము (3)
19. THIN వ్యతిరేక పదం ఆంగ్లంలో(5)
20. ఆంధ్రప్రదేశ్ రాజధాని (5)
21. మంచి వార్త (3)
24. కర్ణాటక రాజధాని(4)
26. శివుని వాహనం (2)
28. చెట్టు(3)
29. కొమ్మలు,మిగిలిన అన్ని భాగాలకు ఆధారం(2)
30. జబ్బు తిరగబడింది(2)
31. మలేరియా వ్యాధి వ్యాప్తిచేసేది(2)
32. కడుపు నొప్పికి వాడేది, జంతికలలో వేసుకునేది (2)

**అడ్డం**

1. సొగసు (4)
4. మన దేశం లో అత్యంత పురాతాన పర్వతాలు(4)
6. కంటి ఒక యానకం నుండి మరో యానకంలోనికి వెళ్ళినపుడు జరిగేది(5)
10. మాల లేదా హారం(2)
11. టపాసులు కాల్చే పండుగ (4)
13. 'పది' ఆంగ్లంలో (3)
14. आशा का विलोम शब्द (3)
15. చంపుట (3)
17. "सकुशल" में उपसर्ग (1)
18. Past form of EAT (3)
21. పూర్ణాంకాలలో మొదటిది(2)
22. గంగా నదికి అతిపెద్ద ఉపనది(3)
23. 'ఆరు' ఆంగ్లంలో (3)
25. అద్దంలో మన ప్రతిబింబం కనపడటానికి కారణమైన కాంతి లక్షణం(5)
27. లెక్కలు మరో విధంగా(4)
29. కిరణజన్యసంయోగక్రియ కు అవసరమైనది(2)
33. పురోగమనం యొక్క వ్యతిరేకం (6)

రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి. లేకపోతే ఒక అద్భుతమైన వ్యక్తితో మాట్లాడే అవకాశాన్ని కోల్పోతారు.

\- స్వామి వివేకానంద






# నేను గీసిన బొమ్మ




ఈ శీర్షిక కేవలం మా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే. మా పాఠశాలలో 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న వారు వారి మనస్సుకు నచ్చిన బొమ్మను వేసి, రంగులు దిద్ది వారి తరగతి ఉపాధ్యాయుని ద్వారా పంపితే, బాగున్నవి ప్రచురించడం జరుగు తుంది. బాగా వేసిన వారికి బహుమతులు కూడా అందజేయడం జరుగుతుంది.





Pedilite పాఠశాలలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో మొదటి బహుమతి పొందిన చిత్రం

యం.జీవిత, 10 వ తరగతి














# ఈ నెలలో మా బడిలో .........

ఈ శీర్షికలో ఈ నెలలో మా బడిలో జరిగిన వివిధ కార్యక్రమాల గురించి వివరించడం జరుగుతుంది. ఇవి ఇతరులకు ప్రేరణనిస్తాయని మా ఉద్దేశ్యం. అలాగే పిల్లలలో కూడా అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలనే ఆసక్తి ని పెంచవచ్చని మా అభిప్రాయం.




టి.దుర్గాదేవి,PET

జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం, ఖమ్మం జిల్లా.




హరిత హారం లో భాగంగా మా బడి లో నేలకొండపల్లి ఎస్సై శ్రీ. రాజశేఖర్ గారు మరియు మా గ్రామ సర్పంచ్ శ్రీ. దండా పుల్లయ్య గారు మొక్కలు నాటారు.



జలశక్తి అభియాస్ కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట కళాశాల విద్యార్థులు మరియు మా గ్రామ సర్పంచ్ శ్రీ దండా పుల్లయ్య గారి ఆధ్వర్యంలో మా బడిలో అవగాహనా కార్యక్రమం మరియు ర్యాలీ జరిగింది.

ఖమ్మం లో నిర్వహించిన క్రాఫ్ట్ ఎండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ లో మా బడి విద్యార్థులు వి.హారిక మరియు జి.అంజలి పాల్గొని అందరి ప్రశంసలు అందుకొన్నారు. వీరికి మా బడిలో పనిచేస్తున్న శ్రీ. ఉపేందర్ Craft Instructor గారు సహకరించారు.





"ప్లాస్టిక్ రహిత సమాజం,పర్యావరణ హిత సమాజం" కోసం మా బడిలో ప్రతి నెలలో వివిధ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. అందులో భాగంగా ఖమ్మంలోని GV MALL నిర్వాహకురాలు శ్రీమతి. సీతామహాలక్ష్మి గారి సహకారంతో, శ్రీ ఆదిత్య కుమార్ గారు కుట్టించిన గుడ్డ సంచులను తండ్రి లేని పిల్లలకు HM Smt. Ch.LATHAగారి ద్వారా అందించడం జరిగింది.

ప్రభుత్వం ప్రకటనలో భాగంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ గారి జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా మా బడిలో ఘనంగా జరుపుకున్నాం. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు చక్కగా మాట్లాడారు.

Pedilite వారి తరఫున మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీ.ఉపేందర్ గారు బడిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు & బహుమతి ప్రధానంలో మొదటి బహుమతి పొందిన జీవిత. ఇందులో గ్రామ పెద్దలు శ్రీ. లెనిన్ మరియు శ్రీ రమేష్ గార్లు పాల్గొన్నారు.










GV MALL, ఖమ్మం వారి VASISTA FOUNDATION ద్వారా అందించిన దుస్తులను, కుట్టించి HM Smt LATHA గారి ఆధ్వర్యంలో పిల్లలకు అందించడం జరిగింది. GV MALL సీతామహాలక్ష్మి గారికి పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.

"जीतने का मजा तब ही आता है, जब सभी आपके..हारने का इंतजार कर रहे हो !"



# ఎవరు కనుగొన్నారో తెలుసా?





యం.సుజిత, 10వ తరగతి,
జి.ప.ఉ.పా.రాజేశ్వరపురం.ఖమ్మం జిల్లా.

## పెన్సిల్ పుట్టిందిలా..........



నేనండీ! మీ పెన్సిల్‌ని. నన్ను ఎవరు కనుగొన్నారో తెలుసా?

ఇంగ్లాండ్ లో పుట్టిన జోసెఫ్ డిక్సన్.చాలా పేదవాడు. ఇల్లు గడవడానికి ఒక దుకాణంలో పనికి కుదిరాడు. యజమాని చెప్పిందల్లా గుర్తు పెట్టుకోవడానికి ఏం చెయ్యాలో తెలియక ఒక రోజు బయటపడి ఉన్న ఒక నల్లరాయితో గోడమీద రాసాడు. అంతే అప్పటి నుండి ప్రతిరోజూ ముఖ్యమైన విషయాలను గోడమీద ఆ నల్లరాయితో రాసేవాడు. ఆ రాయి ఏంటో తెలుసా? అదే 'గ్రాఫైట్'. అతనికి చిన్న ఆలోచన వచ్చింది. ఆ రాయిని పొడి చేసాడు. కాస్త ముద్దగా ఉండటం కోసం దానికి ఆముదం లాంటి పదార్థాన్ని కలిపి, దాన్ని ఒకగొట్టంలోకి ఎక్కించి బాగా ఎండాక రాసాడు. అంతా బాగానే ఉంది. కానీ కాస్త బరువు గా ఉండి రాయడానికి అంతగావీలుకా లేదు. చేతులు నల్లగా అయ్యేవి. రకరకాలుగా ప్రయోగాలు చేసాడు. చెయ్యగా చెయ్యగా కొన్ని రోజులకు ఓ ఉపాయం తట్టింది.ఒక సన్నని చెక్క ముక్కను తీసుకొని దానికి చిన్న రంధ్రాన్ని చేసి గ్రాఫైట్ ముద్దను నింపి బాగా ఎండిన తర్వాత రాసాడు.

అంతే అద్భుతంగా నేను తయారైయ్యాను. సన్నగా రాయడం, చేతులకు నల్లగా అంటకపోవడం, వేగంగా రాయడం లాంటివి జరిగాయి. మొదట్లో నన్ను గుండ్రంగా తయారు చేసేవారు. తర్వాత ఎన్నో మార్పులతో ఈ రోజు నేను మీకు రకరకాలుగా ఉపయోగపడుతున్నాను. నన్ను గ్రాఫైట్‌తో చేస్తారని అర్థమైంది కదూ! గ్రాఫైట్ అనేది ఒక కర్బన పదార్థం. వజ్రం కూడా కర్బన పదార్థమే. కానీ వజ్రానికున్నంత కఠినత్వం గ్రాఫైట్‌కు లేదు.

ఈ రోజుల్లో నన్ను పంచభుజి,అష్టభుజి రూపాల్లోనే తయారు చేస్తున్నారు. ఆ రూపాల్లోనే ఎందుకు తయారుచేస్తున్నారో ఎప్పుడూ మీకు సందేహం రాలేదా? నన్ను తయారు చేయడానికి ఉపయోగించే చెక్కతో గుండ్రని ఆకారంలో చేయడం కంటే, పంచభుజి, అష్టభుజి రూపంలో చేస్తే ఎక్కువ సంఖ్యలో తయారు చేయవచ్చట. చెక్క వృథా తగ్గుతుందట.అంతేకాదు ఇపుడు రకరకాల రంగులలో కూడా తయారుచేస్తున్నారు.

వీటిని నాతోనే (పెన్సిల్ తో) గీశారంటే నమ్మగలరా !















దీనిని చూడండి.




అర్థం కాలేదు కదూ! మీరు నన్ను (పెన్సిల్) కొన్నపుడు ఎప్పుడైనా నా పైన ఏమి రాసి ఉంటుందో చూశారా?

ఈ సారి చూడండి. ఈ ప్రక్కన ఉన్నవి అవే. 9B, 8B, 7B, ..........., HB, F, H, 2H, ........ ఇలా ఉన్నాయి కదా.

ఇప్పుడు మీ దగ్గర ఉన్న దానిపై ఏమి ఉందో చూడండి.

చూసారు కదా! HB అని ఉంది కదా! 9B తో గీసిన దానికి, HB తో గీసిన దానికి తేడాను చూడండి. ఇప్పుడైనా అర్థం అయ్యిందా. మందంగా గీయడానికి ఒకటి, సన్నగా గీయడానికి ఒకటి, మృదువుగా గీయడానికి ఒకటి ఇలా రకరకాలుగా తయారుచేస్తారు. వాటిని గుర్తు పట్టాలంటే ఏదో ఒక గుర్తు ఉండాలి కదా! అవే ఇవి. అర్థం అయ్యిందా. 9B ఉన్న దాన్నిPAINTER లు వాడతారు. మృదువుగా వుండి బాగా నల్లగా పడుతుంది. HB ఉన్నది మనం రోజు వాడేది. దీనితో సన్నని గీతాలు గీయవచ్చు. మిగిలినవి మీకు అర్థం అయ్యేవుంటాయి.

ఇక పోతే నన్ను రకరకాలుగా తయారు చేస్తున్నారని ఇందాకే చెప్పాను కదా. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి SEED PENCIL అని, RECYCLED PAPER PENCIL అని తయారుచేస్తున్నారు.





SEED PENCIL అంటే మొక్క గా పెరిగే పెన్సిల్. అర్థం కాలేదా. మీరు నన్ను వాడేసిన తరువాత ఎక్కడ పడితే అక్కడ పడేస్తారు కదా. అలా పడేసిన తర్వాత వర్షాలు పడినపుడు నాలో పెట్టిన గింజ నుండి మొక్క మొలుస్తుంది. అలా పర్యావరణ హితంగా మారిపోతాను. మీకు మొక్కలు నాటడమంటే చాలా ఇబ్బంది కదా. పక్కన ఇచ్చిన బొమ్మను చూశారా. వాటిపై ఈ విత్తనాలు వున్నాయో కుడా రాసారు. ఇక్కడ ఇచ్చినవి Jupiter Pencils, Tamilnadu వారు తయారు చేస్తున్నారు.



అలాగే మరో రకం RECYCLED PAPER PENCIL. అంటే అర్థం అయ్యే వుంటుంది. నన్ను తయారు చెయ్యాలంటే చెక్క కావాలి. అందుకు చెట్లు నరకాలి. అది నాకు ఇష్టం ఉండదు. నా ఇష్టాన్ని దృష్టిలో వుంచుకొని వాడి పడేసిన పేపర్ తో నన్ను తయారు చేస్తున్నారు. వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఎందుకంటే వాళ్ళు చెట్లను కాపాడడమే కాకుండా, వాడిన కాగితాలతో చెత్త పెరిపోకుండా చేస్తున్నారు. ఇక్కడ ఇచ్చినవి SHANKAR ENTERPRISE, SURATH వారు తయారుచేసినవి.


**మీరూ వీటిని వాడి పర్యావరణానికి సహాయ పడండి. వాడతారు కదూ!**



**ఇక సెలవ్**

**మీ పెన్సిల్**





మన జాతీయ భాష అయిన హిందీ ని మనం తప్పనిసరిగా నేర్చుకోవాలి. అప్పుడే మనం ఈ దేశంలో ఏ మూలకు వెళ్ళినా బ్రతకగలం. కనీసం రోజుకు రెండు మూడు పదాలైనా నేర్చుకోవాలి. అందులో భాగంగా జోక్స్ తో ప్రారంభిద్దామని అనుకున్నాను. వీటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి.

## हिन्दी चुटकुले

1. **रमेश:** बताओ ऐसी क्या चीज है जो फ्रिज में रखने पर भी गरम ही रहती है?

   **सुरेश:** पता नहीं, तुम बताओ।

   **रमेश:**गरम मसाला।



वाणी कुमारी,यस.ए
जि.प.उ.पा.राजेश्वरपुरम

2. DOG सड़क पे उल्टा पड़ा था तो लोग उसकी पूजा करने लगे....क्यों ??

   .

   .

   क्योकि DOG उल्टा GOD होता हैं...



# నేను చేసిన ప్రయోగం

ఈ శీర్షికలో  మా బడి విద్యార్థి ఆ నెలలో తాను చేసిన ప్రయోగాన్ని వివరించడం జరుగుతుంది. ఇది ప్రతి విద్యార్థికి ప్రేరణగా ఉంటుందని మా అభిప్రాయం. చాలా మంది విద్యార్థులు ప్రయోగాలను చేస్తున్నప్పటికీ, బడికి క్రమం తప్పకుండా రావడం లో గానీ, క్రమశిక్షణలో గానీ, చదవడంలో గానీ ముందున్న వారికి ముందుగా అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

## ఈ నెల ప్రయోగం చేసిన వారు: డి.కళ్యాణి, 7వ తరగతి



హాయ్ ఫ్రెండ్స్! నేను ఈ రోజు మీకు చాలా సులభంగా బీట్ రూట్ తో సహజ సూచిక తయారు చేసి, దానితో ఆమ్లాలను క్షారాలు ఎలా పరీక్షించాలో మీకు చెపుతాను, మీరూ  ట్రై చేయండి. చేస్తారు కదూ..........

## బీట్ రూట్ తో సహజ సూచిక:

**లక్ష్యం:** బీట్ రూట్ సూచికఆమ్లాల, క్షారాల మరియు లవణాల రంగులను ఎలా మారుస్తుందో పరీక్షించుట



**తీసుకున్నవి:** బీట్ రూట్ రసం, కొన్ని ఆమ్లాలు, కొన్ని క్షారాలు, పరీక్ష నాళికలు, డ్రాపర్,స్టాండు.

**చేసిన విధానం:**నేను ముందుగా బీట్ రూట్ తీసుకొని దానిని ముక్కలుగా కత్తిరించి,ఒక గిన్నెలో వేసి, నీళ్ళు పోసి, కాసేపు మరిగించి, చల్లార్చి వడపోసాను. అంతే బీట్ రూట్ సూచిక తయారైంది.





ముందుగా ఒక పరీక్షనాళిక తీసుకొని అందులో డ్రాపర్ తో సల్ఫ్యూరికామ్లాన్ని తీసుకొని, దానికి డ్రాపర్ తో బీట్ రూట్ సూచిక కలిపాను. అది ఎరుపు రంగులోనికి మారింది. తర్వాత మరొక పరీక్షనాళిక తీసుకొని అందులో డ్రాపర్ తో హైడ్రోక్లోరికామ్లాన్ని తీసుకొని, దానికి డ్రాపర్ తో బీట్ రూట్ సూచిక కలిపాను. అది కూడా ఎరుపు రంగులోనికి మారింది. కాకపోతే కొద్దిగా తేడా వుంది.





తర్వాత మరొక పరీక్షనాళిక తీసుకొని అందులో డ్రాపర్ తో సోడియం హైడ్రాక్సైడ్  తీసుకొని, దానికి డ్రాపర్ తో బీట్ రూట్ సూచిక కలిపాను. అది కూడా పసుపు రంగులోనికి మారింది.

తటస్థ పదార్థాలలో ఎటువంటి మార్పు కనపడలేదు.

బీట్రూట్ సూచిక ఆమ్లాలను ఎర్ర రంగు లోనికి, క్షారాలను పసుపు రంగులోనికి మార్చింది.

కాబట్టి బీట్ రూట్ సూచికను మనం ఆమ్ల, క్షారాలని గుర్తించే సూచికగా వాడవచ్చు.




ఈ చిన్న ప్రయోగాన్ని చేస్తారు కదూ!

వచ్చే నెలలో మరో ప్రయోగంతో మళ్ళీ కలుద్దాం.

చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో,
భూమిని చూసి ఓర్పును నేర్చుకో,
చెట్టును చూసి ఎదుగుదల నేర్చుకో,
ఉపాధ్యాయుడిని చూసి సుగుణాలు నేర్చుకో.
- సర్వేపల్లి రాధాకృష్ణన్.



విమర్శించే వ్యక్తి
దిగాజారుతాడు, విశ్లేషించే
వ్యక్తి ఎదుగుతాడు



పుస్తకం గొప్పదనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడుతుంది.
- మహాత్మా గాంధీ

# సులభంగా గణితం నేర్చుకుందాం!



వి.వేణుగోపాల్ రాజు,SA
ZPHS
RAJESWARAPURAM

మన పాఠశాలల్లో చాలా మంది విద్యార్థులకు గణితంలో చతుర్విధ ప్రక్రియలు సరిగా రావడం లేదు. వాటి కోసం ఎన్నెన్నో కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. గణితం వచ్చిన వారికి అన్ని సబ్జెక్టులు సులువుగా వస్తాయని చాలా పరిశోధనలలో తేలింది. చిన్న చిన్న టెక్నిక్స్ తో పెద్ద పెద్ద లెక్కలను సులువుగా ఎలా చేయవచ్చో ఈ శీర్షిక ద్వారా పిల్లలకు చేరితే మనం కొంత వరకు విజయం సాధించిన వారమౌతాం.

కాబట్టి ఈ శీర్షికలో ప్రతి నెలా గణిత చతుర్విధ ప్రక్రియలలో ఏదో ఒక దానికి చిట్కాలను వివరించడం జరుగుతుంది.

## 5 చే గుణించడం ఇంత సులభమా!

2546 × 5 విలువ ఎంత అనగానే 'అబ్బో అంత పెద్ద లెక్క వెంటనే ఎలా చెబుతారు' అని అంటారు కదా! కానీ చాలా సులభంగా చెప్పవచ్చు.

అదెలా అంటారా......

| ఉదా: 1 | ఉదా: 2 |
|---|---|
| 24 × 5 = ? | 45 × 5 = ? |

దేనినైనా '5' చే గుణించాలంటే మొదట, ఇచ్చిన సంఖ్యను '2' తో మనసులో భాగించుకుంటూ వెళ్ళి, భాగఫలాన్ని రాసుకోవాలి. ఆ తర్వాత శేషం ఎంత అనేది చూసుకొని, శేషం '0' ఐతే భాగఫలం చివర '0' వెయ్యాలి. లేదా శేషం '1' అయితే భాగఫలం చివర '5' వెయ్యాలి. అంతే గుణకారం అయిపోయినట్లే.

ఉదా: 1 ని చూద్దాం

24 ను 2 చే భాగించగా భాగఫలం 12, శేషం '0' వచ్చింది కాబట్టి భాగఫలం ప్రక్కన '0' చేర్చాలి. అనగా 24 × 5 = 120

ఉదా: 2 ను చూద్దాం

45 ను 2 చే భాగించగా భాగఫలం 22, శేషం '1' వచ్చింది కాబట్టి భాగఫలం ప్రక్కన '5' చేర్చాలి. అనగా 45 × 5 = 225

ఈజీగా వుందా! వచ్చే నెల మరో చిట్కాతో మళ్ళీ కలుద్దాం. ఇక సెలవ్.



మీ **వేణుగోపాల్ రాజు**



శకుంతలా దేవి(నవంబర్ 4,1929 – ఏప్రిల్ 21, 2013) ప్రపంచ ప్రసిద్ధ ఖగోళ, గణిత, మరియు జ్యోతిష శాస్త్రవేత్త.ఈమెను Human Computer అని పిలుస్తారు.పుస్తకాలు కూడా రాసింది. ప్రపంచంలో అత్యంత వేగంగా లెక్కలు చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకుంది.

దైవ చింతనను వ్యక్తం చేయలేని ఏ సమీకరణమైనా సరే నాకు శూన్యం తో సమానం.

\- శ్రీనివాస రామానుజన్




# అద్భుత యంత్రం



డి.జయమ్మ, SA

ZPHS RAJESWARAPURAM




అనేక అద్భుతాలకు నిలయమైన మన శరీరం ఈ ప్రపంచంలోని అన్ని వింతల కన్నా గొప్పవింత. ఎందుకో తెలుసా ! మన శరీరంలోగల అనేక అవయవ వ్యవస్థలు ఒక్కొక్కటి ఒక్కొక్క వింతగా మనం చెప్పుకోవచ్చు. మనం నిద్రపోయినపుడు మన శరీర అవయవాలన్నీ నిద్ర పోతాయా? మనశరీరంలో 2% బరువు మాత్రమే ఉండే మన మెదడు 20% ఆక్సిజన్ను గ్రహిస్తుందంటే ఆశ్చర్యం కాదా! నిరంతరాయం గా పనిచేసే గుండె లాంటి యంత్రాన్ని శాస్త్రవేత్తలు ఇంతవరకు కనిపెట్టలేక పోతున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. మన మూత్రపిండాలలో మిలియన్ల సంఖ్యలోగల ఒక్కొక్కనెఫ్రాన్, ఫ్రిజ్ పరిమాణంలో గల ఒక్కొక్క డయాలసిస్ యంత్రానికి సమానమం అన్న సంగతి మీకు తెలుసా! ఎవరైనా పనిచేస్తే అలసిపోతాం, కానీ ఎంత ఎక్కువ పని చేస్తే అంత కంటే రెట్టింపు షార్ప్ గా తయారవుతుంది మన మెదడు. ఒకే ఆఫీస్ లోని పక్క పక్క సెక్షన్ లకు ఫైల్స్ మారాలంటే గంటలు, రోజులు పడుతుంది, కానీ మన మెదడు కి సమాచారం సెకన్ల వ్యవధి లోనే చేరుతుందని మీకు తెలుసా? మార్కెట్ లలో లభించే ఖరీదైన కెమెరాల కంటే మన కన్ను మెగాపిక్సెల్ ఎక్కువ అని మనలో ఎంత మందికి తెలుసు. నవ్వే టప్పుడు విడుదలయ్యే హార్మోన్ లు మన సంతోషాన్ని ఎక్కువ చేస్తాయని మనకు తెలిస్తే మనం రోజూ నవ్వకుండా ఉంటామా. తక్షణమే శక్తి ని ప్రసాదించే ఫ్లైట్&ఫైట్ హార్మోన్ గూర్చి మీకు తెలుసా.

ఆకలిని మన మెదడుకి తెలియ చేసే ఘ్రెలిన్అను హార్మోన్ లేకపోతె ఏమవుతుందో. ఏడ్చినా, నవ్వినా కన్నీరే ఎందుకు వస్తుందో, నీడలోంచి ఎండలోకి రాగానే కళ్ళు మసకలు కమ్ముతాయి ఎందుకో. పులుపు చూడగానే నోట్లో నీరు ఎందుకు ఊరుతుందో.ఎక్కువదూరం కదలకుండా ప్రయాణం చేస్తే కాళ్ళు ఉబ్బుతాయి ఎందుకో. టీచర్ లు చెబితే పెద్ద పెద్ద పిల్లలే బుద్దిగా వింటారు కదా! మరి మన మాటలు వినని కండరాలు మన శరీరం లో ఉన్నాయని తెలుసుకొని మనం ఏం చేద్దాం. ఇలా చెప్పుకొంటూ పోతే అనేకం. ఎక్స్ -రే లకు కూడా దొరకని రహస్యాలను దాచే మనసు పొరలలోకి, మన అవయవవ్యవస్థ లలోకి తొంగి చూసే ముందు మన అవయవ వ్యవస్థ లేమిటో ఒక్కసారి తెలుసుకొందామా!

అవి, జీర్ణ వ్యవస్థ, శ్వాస వ్యవస్థ, రక్త ప్రసరణ వ్యవస్థ, కండర వ్యవస్థ, అస్థి పంజరవ్యవస్థ, నాడీ వ్యవస్థ, శోష రస వ్యవస్థ, అంతస్రావి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి వ్యవస్థ, విసర్జన వ్యవస్థ, వ్యాధినిరోధక వ్యవస్థ. ఒక్కొక్క అవయవ వ్యవస్థ గూర్చి ఒక్కొక్క నెల వివరంగా తెలుసుకొందాం.

**అంత వరకు సెలవు**

**మీ జయమ్మ**





## మీకు తెలుసా!

జగదీశ్ చంద్ర బోస్ (నవంబర్ 30, 1858 - నవంబర్ 23, 1937) : మన దేశానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త. వివిధ రకాలైన పరిస్థితులలో మొక్కలు ఎలా స్పందిస్తాయో ఈయన నిరూపించాడు. దాని కోసం ప్రక్కనే ఇచ్చిన క్రేస్కోగ్రాఫ్ అనే పరికరాన్ని కనుగొన్నాడు. మన దేశం నుండి 1904 సం.లో అమెరికా దేశపు పేటెంట్ హక్కులు పొందిన మొదటి వ్యక్తి.



# లెక్కల చమత్కారాలు (మొక్కలలెక్కలు)




MD.SUJATH ALI, SA
ZPHS RAJESWARAPURAM


**హాయ్ పిల్లలూ! ఈరోజు మనం కాస్త సమయాన్నికొత్త కొత్త విషయాలు తెలుసుకునేందుకు కేటాయిద్దామా! ఇప్పుడు మొక్కల లెక్కలు గురించి తెలుసుకుందామా! మొక్కలేంటీ, లెక్కలు చేయడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? మీరిది చదవడం మొదలు పెట్టేయండి.**

అప్పుడప్పుడే పెరుగుతున్న మొక్కల చిగుళ్ళ భాగం పరిశీలించి చూస్తే చాలా చమత్కారం కనిపిస్తుంది. కాండం చుట్టూ ఒక ప్రత్యేక క్రమంలో ఆకులు పెరుగుతాయి. ఈ క్రమాలు క్రింది విధంగా ఉంటాయి.


పటం (I) లోని అమరికను గమనించండి. మొదటి ఆకు (1) వచ్చాక రెండవఆకు (2) కాండం సగం చుట్టాక అనగా 180° కోణం తిరిగాక



వస్తుంది. అంటే ఒక పూర్తి చుట్టు తిరిగే సరికి రెండు ఆకులు కనిపిస్తాయి. దీనిని 1/2 గా సూచిద్దాం. 1, 3, 5, 7,9... సంఖ్యలు గల ఆకులు ఒకవైపు 2, 4, 6, 8.... సంఖ్యలు గల ఆకులు ఎదురు వరుసలో పెరుగుతాయి. వరి వగైరా ధాన్యపు మొక్కలు (అన్నిరకాలగడ్డిమొక్కలు) ఈ ½ తరగతికి చెందుతాయి.



పటం (II): ఇకరెండవది. కొన్నిరకాల మొక్కల కాండం ఒకచుట్టూ తిరిగే సరికి 3 ఆకులు కనిపిస్తాయి. అనగా 1వ, రెండవ ఆకులు మధ్యకోణం 120° ఉంటుంది. 1, 4, 7, 10.... సంఖ్యలు గల ఆకులు ఒక వరుసలోనూ, 2, 5, 8, 11..... సంఖ్యలు గల ఆకులు మరోవరుసలోనూ 3, 6, 9, 12... సంఖ్యలు గల ఆకులు మరొక వరకు జరుగుతాయి. దీనిని 1/3 తరగతి అనుకుందాం. సెడ్జిజాతి మొక్కలు ఈతరగతికి చెందుతాయి.



పటం (III): మరికొన్ని మొక్కలలో కాండం చుట్టూ రెండు సార్లు తిరిగితే 5 ఆకులు వస్తాయి. అంటే 144° కోణం తిరిగితే ఒక్కొక్కఆకు వస్తుంది. దీనిని 2/5 గాసూచిద్దాం. ఆపిల్, చెర్రీ, రేగుచెట్లు ఈ తరగతికి చెందుతాయి.

మరికొన్ని రకాల మొక్కల కాండం చుట్టూ 3 సార్లు తిరిగితే 7 ఆకులు వస్తాయి. అంటే ఆకుల మధ్యకోణం 135° ఉంటుంది. దీనిని 3/8 గా సూచిద్దాం. అరటిచెట్లు ఈ 3/8 తరగతి క్రిందకి వస్తాయి. ఈ తరగతులన్నీవరుసగా రాస్తే 1/2, 1/3, 2/5, 3/8....... అనే శ్రేణి (Series) వస్తుంది.

ప్రకృతిలోని ఏరకం మొక్కల ఆకులను గమనించినా పైక్రమంలో తప్ప మరే విధంగానూ ఉండదు. ఏమొక్క ఆకులైనా పైశ్రేణిలోని ఏదో ఒకసంఖ్యలో ఇమిడి ఉంటుంది. అనగా కొమ్మచుట్టూ ఒకసారి తిరిగితే 4 (1/4) ఆకులు ఉండేటట్లు ఏమొక్కా ఉండదు. ఎంత వెతికినా అలాంటి మొక్క కనపడదు. చూడండి పిల్లలూ... ప్రకృతిలోని మొక్కల ఆకులు అమరిక లెక్కతప్పట్లేదు.

పైనవున్న శ్రేణిలోని సంఖ్యలను జాగ్రత్తగా గమనిస్తే ఒక చమత్కారం కనబడుతుంది. ఏ రెండు ప్రక్కప్రక్క భిన్నాలను తీసుకుని వాటిలవ, హారాలను విడివిడిగా కూడితే తరువాత భిన్నం వస్తోంది. అనగా

1+1 = 2          2+3 = 5

1/2, 1/3 తరువాతి భిన్నం 2/5 అవుతుంది. (అనగా లవాల మొత్తం 1+1=2, హారాల మొత్తం 2+3=5 అనగా తరవాతి భిన్నం 2/5)

అదేవిధంగా 1/3, 2/5 భిన్నాల తరువాత భిన్నం =3/8, ఇపుడు 2/5, 3/8 తరువాతి భిన్నం మీరుచెప్పగలరా?..... (5/13).

ఈశ్రేణిలోని ప్రతిసంఖ్యా ఈధర్మాన్నిపాటిస్తుంది. వీటినే "ఫిబోనాకి"సంఖ్యలు అంటారు.1175 సం.లో ఇటలీలోని పీసానగరంలో పుట్టిన "లియోనార్డోఫిబోనాకీ" అను ప్రసిద్ధ గణితశాస్త్రవేత్త కనిపెట్టినసంఖ్యలు ఇవి.

ప్రకృతిలోని మొక్కలులోని ఆకుల అమరికలు "ఫిబోనాకీసంఖ్యల" ధర్మాలను పాటిస్తున్నాయి. బహుశా చెట్లలోని ప్రతి ఆకుకీ సూర్యరశ్మి సరిగా తగలాలని ఆకులు "లెక్కలను" సరిగా పాటిస్తున్నాయి.     మీ **అలీ**

బొమ్మలు గీసిన వారు:
దీక్షిత,హైందవి, విష్ణు వర్ధన్ VI EM
ZPSS RAJESWARAPURAM

ఈ శీర్షిక లో ప్రతి నెలా మన దేశం గురించిన విషయాలు తెలియజేయడం జరుగుతుంది.





వీరాంజనేయులు, SA

ZPHS RAJESWARAPURAM


# మన దేశం

## 28 రాష్ట్రాలు.. 9 కేంద్రపాలిత ప్రాంతాలు




ఈనాడు సౌజన్యం తో

వీటిలో మీరు ఎన్ని చూశారు!



# ఈ నెలలో పుట్టిన నేను పెద్దయ్యాక....

హాయ్ ఫ్రెండ్స్! ఈ నెలలో పుట్టిన రోజ జరుపుకుంటున్న మా విద్యార్థులు వారి మనోభావాలను ఈ శీర్షిక లో తెలియజేస్తారు. ముందుగా వీరికి జన్మదిన శుభాకాంక్షలు. ఐతే ప్రతి నెలా చాలా మంది పుట్టిన రోజ వేడుకలు జరుపుకుంటారు. కాబట్టి వారిలో క్రమం తప్పకుండా బడికి వచ్చే వాళ్ళకు, చదువులో చురుకుగా వుండే వాళ్ళకు, ఆటలలో పాల్గొనే వాళ్ళకు ముందు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.



హాయ్ ఫ్రెండ్స్, ముందుగా నాకు జన్మ నిచ్చిన మా అమ్మకు జీవితాంతం రుణపడి వుంటాను. ఆ తర్వాత మన దేశానికి. నేను పెద్దయ్యాక **ఆర్మీలో** చేరి దేశ సేవ చేస్తూ అమ్మను మంచిగా చూసుకుంటానని మాటిస్తున్నాను.

మీ స్నేహితుడు: డి.గణేష్, 10వ తరగతి.

హలో ఫ్రెండ్స్, నేను ఈ నెలలో పుట్టినరోజ జరుపుకోవడానికి కారణమైన అమ్మ అంటే నాకు ప్రాణం. నేను అమ్మను ఎప్పుడు బాధ పెట్టనని, పెద్దయ్యాక కూడా సంతోషంగా వుంచుతానని మాటిస్తున్నాను. నేను పెద్దయ్యాక **టీచరై** సమాజానికి సేవ చేస్తాను.

మీ స్నేహితురాలు:యస్.శ్రావణి, ఏడవ తరగతి.



హాయ్ ఫ్రెండ్స్, ఈ జగం వున్నంత వరకు దేనినైన మరచిపోతామేమో గాని, అమ్మను మరిచిపోలేము.ఎవ్వరి దగ్గర చెయ్యని చిలిపి పనులు అమ్మ దగ్గర చేస్తాం.అమ్మ తిడుతుందంటే మన మంచి కోసమే అని తెలుసుకోవాలి.నేను పెద్దయ్యాక **డాక్టర్** అయ్యి అమ్మను జాగ్రత్తగా చూసుకుంటాను.

మీ స్నేహితురాలు: ఆర.ఉదయ శ్రీ, తొమ్మిదవ తరగతి.



హలో ఫ్రెండ్స్, నా పుట్టుకకు కారణమైన అమ్మకు నా వందనం. అమ్మను ఎప్పుడూ కష్ట పెట్టనని మాటిస్తున్నాను. పెద్దయ్యాక **డాక్టర్** అయ్యి అమ్మకు, ఊరి వాళ్ళకు సేవ చేస్తాను.

మీ స్నేహితురాలు: భద్రమ్మ10వ తరగతి.



హాయ్ ఫ్రెండ్స్,
మనకు జన్మనిచ్చిన అమ్మ అంటే నాకు చాలా చాలా ఇష్టం. అమ్మ మనకోసం ఎన్నో త్యాగాలు చేస్తుంది. అనుక్షణం మన కోసం తపన పడుతుంది. నాకు పెద్దయ్యాక **డాక్టర్** అవ్వాలని ఉంది. అమ్మానాన్నలను మంచిగా చూసుకుంటూ ప్రజలకు సేవ చేస్తాను.

మీ **నవ్య,తొమ్మిదవ తరగతి**

అందరికీ నమస్కారం,
నేను ప్రతి సంవత్సరం ఈ నెల లో పుట్టి న రోజ జరుపుకుంటున్నాను. నాకు జన్మనిచ్చిన అమ్మను ఎప్పుడూ కష్ట పెట్టనని మాటిస్తున్నాను. పెద్దయ్యాక **బ్యాంకు మేనేజర్** కావాలని నా కోరిక. అమ్మకు, ఊరి వాళ్ళకు సేవ చేస్తాను.

మీ స్నేహితుడు: **కే.శివ, ఏడవ తరగతి**.





హాయ్,
నాకు అమ్మ అంటే చాలా చాలా ఇష్టం. ఎందుకంటే నా కోసం కూలికి వెలుతుంది. అమ్మ నా కోసం ఎంతో త్యాగం చేస్తుంది. నా కోసం తపన పడుతుంది. నాకు పెద్దయ్యాక **డాక్టర్** అవ్వాలని ఉంది. అమ్మను మంచిగా చూసుకుంటూ ప్రజలకు సేవ చేస్తాను.

మీ ఆకాష్, ఆరవ తరగతి



హాయ్, నాకు అమ్మ అంటే చాలా ఇష్టం.అమ్మ నా కోసం ఎంతో త్యాగం చేస్తుంది. నా కోసం తపన పడుతుంది. నాకు పెద్దయ్యాక **మంచి రైతు ని** అవ్వాలని ఉంది. అమ్మను మంచిగా చూసుకుంటాను.

మీ లోకేష్, ఏడవతరగతి.





# ఇంగ్లీషులో మాట్లాడదాం రండి



G.SRINU, SA
ZPSS RAJESWARAPURAM


హాయ్ ఫ్రెండ్స్!

ఆంగ్ల మాధ్యమం లో చదివే పిల్లలు ఆంగ్లాన్ని స్కూల్ లో నేర్చుకొంటారు. మనం వారితో ఇంట్లో తెలుగు లోనే మాట్లాడుతున్నాం. పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడకపోవడానికి ఇది ఒక కారణం. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం. ఈ నాలుగు ప్రక్రియల ద్వారా మాత్రమే ఒక భాష ను నేర్చుకోగలం. మన స్కూల్స్ లో దీన్ని తలకిందులు చేసి.... అంటే ముందుగా రాయడం తో ఇంగ్లీష్ భాష నేర్పుతారు . అందుకే పిల్లలు సరిగా ఇంగ్లీష్ నేర్చుకోరు. అదేంటి అంటే "మీరు ఇంట్లో కూడా ఇంగ్లీష్ లో మాట్లాడితేనే పిల్లలకు ఇంగ్లీష్ వస్తుంది" అంటారు. అలాంటి గురువులకు ఇలా చెప్పాలి, "తల్లి పిల్లలకు భాష నేర్పించినట్టే, అంటే పిల్లలతో చిన్న చిన్న మాటలతో మాట్లాడడం...... వారు దాన్ని తిరిగి చెప్పేలా చెయ్యడం......భాషా బోధన ఇలా జరగాలి అని."

ఇకపోతే మనం ఇపుడు పైన చెప్పినట్లుగా ముందుగా వినడం, మాట్లాడడం,చదవడం, రాయడం క్రమంలో వెళదాం. మరి మొదటిది వినడం అన్నారు గదా! వినడానికి ఆడియో ఇవ్వకుండా రాసిస్తే ఎలాగా అనుకోకండి. ఆడియో ఇక్కడ ఇవ్వలేం కదా! క్రింద ఇచ్చినవి మీ ప్రక్కన ఇంగ్లీష్ వచ్చిన వారిని చెప్పమనండి, మీరు వినండి, తిరిగి వారితో మాట్లాడండి, ఆ తర్వాత చదవండి, రాయండి. అంతే సింపుల్ గా ఇంగ్లీష్ లో మాట్లాడటం అలవాటు అవుతుంది. చేస్తారు కదూ......................

ఇక్కడ బొమ్మలతో మొదలుపెడతాను. బొమ్మలే మీకు చాలా నేర్పుతాయి.ముందుగా పరిచయం చేసుకోవడం ఎలానో చూద్దాం.........





ఈ పరిచయ కార్యక్రమాన్ని మీరు ప్రాక్టీస్ చేయండి......

వచ్చే నెలలో మళ్ళీ కలుద్దాం......

మీ శ్రీను

*Tell me and I forget. Teach me and I remember. Involve me and I learn*

*- Benjamin Franklin*





# కవితలు రాద్దాం రండి.......



హాయ్ ఫ్రెండ్స్,

పిల్లలకు భాషా మాధుర్యాన్ని తెలపాలని, వారిలో భాషా నైపుణ్యాన్ని పెంచాలని, భాష పట్ల అభిరుచి పెంచాలని ఈ శీర్షికను ప్రారంభిస్తున్నాం. ఇందులో పిల్లలు మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రాసిన కవితలను ప్రచురించడం జరుగుతుంది. ముఖ్యంగా పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. మొదటి సంచిక కాబట్టి ఉపాధ్యాయులవే ఎక్కువగా ఇవ్వడం జరిగింది.



## ఎకో ఫ్రం వ్యాలి

పెళ్ళలుగా కురుస్తున్న మంచుగడ్డలు
నల్లటి దారులకిరువైపులా నిలుచున్న తెల్లటి చెట్లు.
తులిప్ వనాలపైనుండి వీచే రంగుల పూల గాలి
సంతూర్ వాయిద్య పరికరం తంత్రుల రవళింతలుపై
గిలిగింతలు దేహం
హిమాలయాల వైపు ఉల్లమరించే పులుగై విహరిస్తుంది.
పైనుండి చీల మండవరకూ
కప్పుకున్న ఉన్ని బట్టలు
లోలోపల ఒణుకుతున్న భయంతనాన్ని బట్టబయలు
కాకుండా కాపాడుతుంది నిజమే..
కుంకుమ పూలు పూసిన ఈ నేల వేళ్లు
ఏ అమాయకపు లేత రక్తంతో తడిసాయో
లతలకు పూసిన యాపిళ్ళు
ఎర్రెర్రగా కందిన బుగ్గలతో ఎంత దీనంగా చూస్తుంటాయి.
ఊహల గవాక్షం నుండి చూస్తుంటే
చౌరాసియా వేణువు గాలికి గగనాంతరాల ఉషోదయాలు
భూపాళరాగ దయా పారావతాలై
గుండె గోపురంపై గుంపులు గుంపులు రెక్కలాడిస్తూ
వాలిపోతాయి.
నిజమే..
భూలోక స్వర్గదామాన్ని
కొన్ని మంచు శిల్పాలు ప్రాణం పణంగా పెట్టి
కాపాడుకుంటాయి
నీవు సౌందర్య పిపాసకుడువా..
తుపాకి గొట్టం మొనపై సీతాకోకలు అందాన్ని
ఆస్వాదించు.

- by గరికపాటి మణీందర్



కుల మతం తెలియదతనికి
అందర్నీ కాపాడటమే తెలుసతనికి
ఏనాడూ భయపడడు శత్రు
సైన్యానికి
దేశ సరిహద్దుల్లోనే ఉంది అతని
ఉనికి
- అతనెవరో కాదు మనల్ని
కంటికి రెప్పలా
కాపాడుతున్న సైనికుడు.
➤ మనోజ, తొమ్మిదవ తరగతి.



## సుందర నందన ప్రపంచం

ఏమీ ఎరుగని పువ్వుల్లారా! ఎల్లలు ఎరుగని బాలల్లారా!
గుండెల ఒదిగే గువ్వల్లారా! గుబాళించు సుమ మల్లెల్లారా! "ఏమీ"
రండి రండి మన బడికి అక్షరాల ఈ గుడికి
ఆనందంతో చిందులు వేద్దాం అక్షరాల పనిపడదాం
మీకు ఏ పాటంటే ఇష్టం మీకు ఏ ఆటంటే ఇష్టం
ఆటలు పాటలు రంగరించి ఆ పాఠాల పనిపడదాం "ఏమీ"
ఆటలు ఎన్నో ఆడేద్దాం ఆ అంకెల గారడీ చూసేద్దాం
గణితంలోని గమ్మత్తులన్ని చకచక మనము నేర్చేద్దాం "ఏమీ"
సరదాగా తిరిగొద్దాం మన పరిసరాలను గమనిద్దాం
పరిసరాలను పాఠాలుగా ఈ ప్రకృతి సంగతి తేల్చేద్దాం "ఏమీ"
బడి అంటే మన గుడియే అది నిన్ను కన్నతల్లి ఒడియే
బ్రతుకు వెలుగును పంచేటి అవని ప్రగతికి చోటిదియే "ఏమీ"
అక్క చెల్లి అన్నా అంటూ చిన్ని బాలలను తమ్ముళ్లంటూ
చక్కగా మనము పిలిచేటి సుందర నందన ప్రపంచమిదియే "ఏమీ"

- by కొత్త శంకర్ రెడ్డి , టీచర్



## ఈ పుస్తకం పై నా మనసులోని మాట

అందమైన అక్షరాల పొత్తమిది
అరుదైన మనోభావాల పొందికిది
నా కనులు కన్న కళాత్మక కల్పనిది
నా కలల సరికొత్త పుస్తకమిది
అందరూ ఈ సంచికను ఆదరిస్తారని ఆశిస్తూ....
మీ - ఆకు(ఆదిత్య కుమార్)

## మెదడుకు మేత :

ఒక గ్రామంలో మోహన్ అనే పాలు అమ్మే వ్యాపారి ఉండేవాడు. అతని వద్ద 8 లీ., 5లీ., 3 లీ., మూడు రకాల పాల క్యానులు ఉన్నాయి. అయితే 8 లీటర్ల పాల క్యాన్ నిండా పాలు ఉన్నాయి, 5 లీటర్ల క్యాను, 3 లీటర్ల క్యానులు ఖాళీగా ఉన్నాయి. ఒకరికి 4 లీటర్ల పాలు కచ్చితంగా కొలిచి పోయాల్సిన పరిస్థితిలో అతను తన వద్ద గల మూడు రకాల క్యాన్లను మాత్రమే ఉపయోగించి ఎలా కొలిచి పోస్తాడో తెలపండి చూద్దాం!
(8, 5, 3 లీటర్ల క్యానులు మాత్రమే ఉపయోగించాలి)

సరియైన సమాధానం పంపిన వారికి బహుమతి ఇవ్వబడును.

సేకరించిన వారు : వేణు, పదవ తరగతి.



# పదాలు పలుకుదాం ఇలా...



**K.SHANKAR REDDY**, SA
ZPSS RAJESWARAPURAM

హాయ్ ఫ్రెండ్స్ ,


ఇంగ్లీష్ చదవడం వచ్చిన పిల్లలు వాటిని పలకడంలో తప్పులు చేస్తుంటారు. దానికి కారణం వాటిని పలకడం లో మెళుకువ తెలియక పోవడమే.

ఈ శీర్షికలో మనం వాటి గురించి ప్రతి నెలా కొంత నేర్చుకుందాం........

ముఖ్యంగా ఇంగ్లీష్ పలికే ధ్వనులకు సంబంధించి PHONEME మరియు GRAPHEME అని రెండు పదాలుంటాయి. PHONEME అంటే SPEECH SOUND మరియు GRAPHEME అనగా WRITTEN REPRESENTATION OF SOUND. సాధారణంగా ఇంగ్లీష్ లో పలకడానికి మొత్తం దాదాపు 44 శబ్దాలున్నాయి.

తిరిగి వాటిని రెండు రకాలుగా విభజించవచ్చు. హల్లుల శబ్దం, అచ్చుల శబ్దం. ఈ నెలలో మనం హల్లులకి సంబంధించిన సౌండ్స్ చూద్దాం........ మీరు వీటి ప్రకారం ప్రాక్టీస్ చెయ్యండి.

Consonants


| Sound | Common spelling | Spelling alternatives | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| /b/ | b<br>ball |  | bb<br>ribbon | | | | |
| /d/ | d<br>dog |  | dd<br>add | ed<br>filled | | | |
| /f/ | f<br>fan |  | ff<br>cliff | ph<br>phone | gh<br>laugh | lf<br>calf | ft<br>often |
| /g/ | g<br>grapes |  | gg<br>egg | gh<br>ghost | gu<br>guest | gue<br>catalogue | |
| /h/ | h<br>hat |  | wh<br>who | | | | |
| /j/ | j<br>jellyfish |  | ge<br>cage | g<br>giraffe | dge<br>edge | di<br>soldier | gg<br>exaggerat<br>e |
| /k/ | k<br>kite |  | c<br>cat | ch<br>christmas | cc<br>acclaim | lk<br>folk | qu<br>bouquet |
| | | | q(u)<br>queen | ck<br>back | X<br>box | | |
| /l/ | l<br>leaf |  | ll<br>spell | | | | |
| /m/ | m<br>monkey |  | mm<br>summer | mb<br>climb | mn<br>autumn | lm<br>palm | |
| /n/ | n<br>nest |  | nn<br>funny | kn<br>knight | gn<br>gnat | pn<br>pneumonia | |
| /ng/ | ng<br>ring |  | n<br>sink | ngue<br>tongue | | | |

*©DSF Literacy Resources – This document may be reproduced for educational purposes*

మీ - శంకర్ రెడ్డి



# కథ చెప్పుతా..ఊ కొడతావా.....



మిత్రులారా! ఈ రోజుల్లో కథలు చెప్పేవారూ, వినేవారూ చాలా చాలా తక్కువైనారు. ముఖ్యంగా పిల్లలలో పఠనాశక్తి పెంచేందుకు కథలు ఎంతగానో ఉపయోగపడతాయని మా అభిప్రాయం. అందుకే ఈ శీర్షికలో పిల్లలు సొంతంగా రాసిన కథలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. తర్వాత సేకరించిన వాటికి ప్రాధాన్యం. ఐతే అవి సందేశాత్మకంగా గానీ, నీతి ప్రాధాన్యం కలవి గానీ అయి ఉండాలి.




ఈ నెల కథ ......

ఒకప్పుడు ఒక ఊరిలో ఒక అమాయక పిచుక వుండేది. మనసులో ఏ కల్మషంలేని ఆ పిచుకకు ఒక రోజు ఒక కాకుల గుంపు పరిచయం అయ్యింది. ఆ కాకులతో పిచుకకి స్నేహం అయ్యింది.

పిచుకకి అందరూ చెప్పారు – ఆ కాకులతో స్నేహం చేయద్దు, అవి మంచివి కావు, అని. కాని ఆ పిచుక మాట వినలేదు.

ఒక రోజు కాకుల గుంపు ఎటో వెళ్తూ పిచుకను కూడా తోడు రమ్మన్నాయి. అమాయక పిచుక ఎక్కడికి, ఎందుకు అని అడగకుండా, ఆ కాకులను గుడ్డిగా నమ్మి వాటితో వెళ్ళింది.

కాకులు ఒక పొలానికి వెళ్లి అక్కడ మొక్కలన్నిటిని పాడు చేయడం మొదలు పెట్టాయి. పిచుక నిస్సహాయంగా ఏమి చేయాలో తోచక అటూ ఇటూ గెంతుతూ వుంది. ఇంతలో ఆ పొలం రైతులు పరిగెత్తుకుంటూ వచ్చి ఒక పెద్ద కర్రతో ఆ కాకులను కొట్టడం మొదలు పెట్టారు. కాకుల గుంపుకు ఇది అలవాటే, అవి తుర్రున ఎగిరిపోయాయి. కానీ పిచుక రైతులకు దొరికిపోయింది.

"బాబోయ్! బాబోయ్! నా తప్పేమీ లేదు, నేను అమాయకురాలిని, నేనేమీ చేయలేదు, నన్ను వదిలేయండి!" అని పిచుక బ్రతిమిలాడింది. కానీ పంట నాశనం అయిన రైతులు కోపం మీద ఉన్నారు. పిచుక మాట నమ్మలేదు కదా, దాని వైపు అసహ్యంగా చూసి మరో రెండు దెబ్బలు వేసారు.

**నీతి:** ఇతరులు మన మిత్రులను చూసి మన గుణం ఏమిటో నిర్ధారించుకుంటారు. అందుకే మనం మంచి గా వున్నా, మన స్నేహితులు చెడ్డ వారైతే మనం కూడా చెడ్డ వాళ్ళమనే అనుకుంటారు.



**సేకరణ:** ఇందు, 9వ తరగతి.

**సూక్తులు:**



1. వ్యక్తి గతంగా ఎన్ని కష్టాల్లో వున్నా సరే పక్క వారికి సాయం చేసేందుకు సమయం కేటాయించిన వారే శక్తివంతులు.
2. గర్వంతో విర్రవీగిన ప్రతి మనిషికి పతనం తప్పలేదు.





# స్టూడెంట్ కార్నర్

హలో ఫ్రెండ్స్,

పిల్లలు తమ అభిప్రాయాలను నేరుగా చెప్పలేకపోవచ్చు. అలాగే కొందరు వారి అభిప్రాయాలకు ఇతరుల స్పందన ఎలా ఉంటుందో అని ఆలోచించే వారు ఉంటారు. ఈ శీర్షిక ద్వారా పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలుపగలరని మా నమ్మకం. అంతేకాక వారిలో తప్పులులేకుండా రాయాలనే జ్ఞానం పెరుగుతుంది.



మిత్రులందరికీ నమస్కారం,

నాకు మా బడి అంటే చాలా ఇష్టం. ఎందుకంటే మా సార్లు , టీచర్లు అందరూ బాగా చెపుతారు. చాలా క్రమశిక్షణతో చూస్తారు. ప్రేయర్ కి కొంచం లేటైనా ఊరుకోరు. కానీ.... నేను మా ఊరి నుండి రావాలంటే చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. మాకు ఆటోలు సమయానికి రావు. నేను బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలనుకొంటున్నాను. మాకు రవాణా సౌకర్యం కల్పిస్తే బావుంటుందని నా అభిప్రాయం.

- Sk.జాయెదా, పదవ తరగతి.



హాయ్,

నేను ప్రతి రోజు బడికి క్రమం తప్పకుండా వస్తాను. ఎందుకంటే మా బడిలో అందరూ చాలా చాలా మంచి విషయాలు చెపుతారు. ప్రయోగాలు చేయిస్తారు. ఆటలు ఆడిస్తారు. కానీ.... మా బడికి గేటు సరిగా లేకపోవడం వలన సాయంత్రం తర్వాత బయటి వాళ్ళు వచ్చి అన్నీ పాడు చేసి వెళుతున్నారు. మేము, మా సార్లు చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. మాకు ఇంకా డిజిటల్ క్లాసులు చెపుతున్నారు.

- శివవర్ధన్, ఎనిమిదవ తరగతి.



హాయ్ ఫ్రెండ్స్,

మా బడి అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఇక్కడ మా సార్లు మమ్ములను వారి పిల్లలుగానే చూసుకుంటారు. మా ఇండ్ల దగ్గరి పరిస్థితులను కూడా అర్థం చేసుకొని మాకు సహాయం చేస్తారు. నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను..... మా బడిలో పిల్లలందరికీ సరిపోను బల్లలు లేవు. మేము రోజు క్రిందనే కూర్చుంటున్నాము. అయినా నాకు బడి అంటే చాలా ఇష్టం.

- నందిని, ఏడవ తరగతి.



ఫ్రెండ్స్ అందరికీ నమస్కారం,

నేను ఈ సంవత్సరమే ఈ బడిలో చేరాను. మేము పక్క వురి నుండి వస్తాము. మాకు ఆటోలు సరిగా వుండవు. మాకు శ్రద్ధగా చదువుకోవాలని వుంది. కానీ.... మా బడిలో సాయంత్రం కాగానే బయటి వారు వచ్చి చికాకు చేస్తుంటారు. ఒక రోజైతే బాటిల్స్ పగలగొట్టి ముక్కలన్నీ ఎక్కడ పడితే అక్కడ పడేసారు. మా ఫ్రెండ్ కాలికి గాయం అయింది. ఇంకా మా బడిలో 3 అంగన్ వాడీలు, ఒక చిన్న బడి ఉన్నాయి.

- దీక్షిత,6వ తరగతి



హాయ్ ఫ్రెండ్స్,

మా బడిలో మంచిగా చెట్లు ఉన్నాయి. మేము వాటికి నీళ్ళు పోస్తాము. మాకు లైబ్రరీ ఉంది, లాబ్ ఉంది. నాకు భోజనం నచ్చింది. వుంది కానీ....మా క్లాసు వాళ్ళకి బల్లలు లేవు. క్రిందనే కూర్చుంటాము. అప్పుడప్పుడు బయటి వాళ్ళు పంపులు పీక్కపోతున్నారు. అప్పుడు మాకు ఇబ్బంది. అయినా నాకు మా బడి అంటే నాకు ఇష్టం.

- అభినయ్, ఏడవ తరగతి.



డియర్ ఫ్రెండ్స్,

మా బడి లో మంచి మంచి కార్యక్రమాలు జరుగుతాయి. నాకు అందరూ టీచర్లు, సార్లు చెప్పేవి బాగా అర్థం అవుతాయి. వీడియో పాఠాలు చూపిస్తారు. ప్రయోగాలు చేస్తాం. క్రమశిక్షణతో వుంటాం. నేను NMMS లో సెలక్ట్ అయ్యాను. దీనికి సహకరించిన మా సార్లకు నా వందనాలు. పదవ తరగతిలో 10/10 సాధించాలనుకుంటున్నాను. అలాగే మీరందరూ బాగా చదవాలని కోరుకుంటున్నాను.

- త్రివేణి, తొమ్మిదవ తరగతి.

ఇది మొదటి నెల కావడం తో వారు తమ అభిప్రాయాలను పాఠశాల గురించే ఎక్కువగా చెప్పారు. వచ్చే నెలలో ఈ పుస్తకం పై కూడా అభిప్రాయాలు చెప్పమన్నాము. దయచేసి గమనించగలరు.